

# మరో దారి లేదు

శ్రీసుధా

చుట్టూ ప్రపంచాన్ని చూసిన తర్వాత స్నేహితులు అందుకున్న అదృష్టాల్ని విన్న తర్వాత, తనకున్న అందం, చదువు చొరవా భేరీజు వేసుకున్న తర్వాత అందరిలాగే రజనీ గర్వపడింది. చేతిలో నాలుగు వందలు సంపాదించి పెట్టే ఉద్యోగం వుంది. మరో ఎనిమిది వందలు సంపాదించేవాడు భర్తగా దొరికితే భవిష్యత్ ఆశాజనకంగానే కాదు అందలం ఎక్కినట్టే అవుతుందని.

రజని ఇరవై ఏళ్ళు రాకుండా ఉద్యోగంలో జేరింది. ఇంట్లో సంపాదించే తండ్రి, తండ్రికి చేదోడుగా అన్నగారు, చదువుకుంటూన్న చెల్లెలు తులసి, మరో చిన్న తమ్ముడు అంతే. మరే బాదరబందీ లేదు. ఆకాశంలో విహరించే పేరులేని అందమైన పక్షికీ తనకీ తేడా ఏంలేదు అన్పించేది రజనీకి.

నేల విడిచి ఎత్తుగా నడవాలనిపించడం ఊహలకు బంగారు మలామా పులుము

కోవడం తప్ప నేలక్రింద అధోలోకం అనేది వుంటుందనీ, అప్పుడప్పుడు ఊహలకు రెక్కలు తెగుతాయనీ తెలియకపోవడం ఘోరమే అవుతుంది. 'మీరు అందంగా వుంటారు.... చక్కగా మాట్లాడతారు' అంటూ కాంప్లిమెంట్స్ ఇచ్చేవాళ్ళు హితులుగానూ, 'హద్దుమీరి ప్రవర్తిస్తున్నావు. ఆ మూర్తి నిన్ను ప్రేమించడంలేదు కోరుకుంటున్నాడంతే' అని పరోక్షంగా హెచ్చరించేవాళ్ళు శత్రువులుగానూ అన్పించసాగారు, రజనీకి.

స్నేహితురాలు కమల ఓ రోజు పెళ్ళి కాని ఆడవాళ్ళ బ్రతుకుల గురించి, వయసు ముదరపెట్టుకుని ఆఫీసుల్లో చాకిరీ చేస్తూ బ్రతుక్కి వెసకపడుతున్న ఆధునిక యువతుల గురించి ప్రత్యక్షంగా చెప్పి పరోక్షంగా రజనీకి చెప్పీ చెప్ప నట్లు సలహా అందించింది.

"మా అన్నయ్య స్నేహితుడు రామం అని వున్నాడే, మనిషి ఫరవాలేదు. జీతం నీకు దొరికేటంతా అతనికీ దొరుకుతుంది. నువ్వొప్పుకుంటే మా అన్నయ్యవి అతనితో మాట్లాడమంటాను...."

రజని పెళ్ళికొడుకు గురించి రక రకాల వాకబులు చేసింది. సవాలక్ష ప్రశ్నలు వేసింది. మనసులో తెగ మధన పడింది.

నాలుగు వందలు సంపాదించే గుమాస్తాకి తను భార్యగా ఊహించు కుంటే రజనీకి వెగటు పుట్టింది.... రామాన్ని మందిలోంచి పరకాయించి చూసింది. సాధారణ మానవుడిగా కన్పించాడు. అంతే! "అతనా" అంది....

కమల రజనిని సముదాయిస్తూ అంది-

"సినిమా హీరోలు మన వెంటపడ్డానికి మనవి వాస్తవ జీవితాలే! ఆఫీసరు వచ్చి మన మెళ్ళో దండవేయడానికి మనకున్న అర్హతలు ఆలోచించుకోవాలి. ఈ హోదా వుంది. చూశావూ అది పైవాడికి పైకి చూడ్డం నేర్పుతుంది. క్రిందివాడికీ పైకి చూడ్డమే అలవాటు చేస్తుంది...."

"వాళ్ళది పెద్ద సంసారం....అతనూ నేనూ గానుగెద్దులమే, ఆ యింటిని ఆదు కోవాలి. కమలా.... నాకున్న అనర్హత లేమిటే. జీవితంలో మామూలు సరదాలు కూడా తీరకుండా బ్రతకడం.... ఛీ.... నేను ఊహించలేనే...."

కమల నవ్వేసింది....

"వాస్తవంగా ఆలోచించడం నేర్చు కోవే! నీకు ఇరవై ఏళ్ళు.... మీవాళ్ళు తెచ్చే సంబంధాలు నీకు నచ్చేదెప్పుడు? నీ పెళ్ళి అయ్యేదెప్పుడు? వాళ్ళ ఓపికకు కూడా ఓ హద్దు వుంటుంది.... వాళ్ళు విసిగి వేసారిన తర్వాత నీ మొగుణ్ణి నువ్వే ఎన్నుకోవల్సి వుంటుంది.... కానీ...."

కమల హితవాక్యాలు రజనీకి నచ్చలేదు. రుచించలేదు. ఆమె దృష్టిలో మూర్తి కదిలాడు. మూర్తి విరాట్

మావారి మంచితనం




స్వరూపంతో రజని మనసు నిండి పోయింది....

తన చూపుకోసం, మాటకోసం పెదవిమీద విరిసే నవ్వుకోసం తపించి పోయే మూర్తి తనకి అన్నివిధాల తగిన వాడు. కాదు, మూర్తికి తనని మించిన స్నేహితురాలు వుండకూడదు.

అలా ఆలోచించుకున్న తర్వాత రజనీకి కమల సలహాలు అమాయకత్వంతో నిండినవిగా అసందర్భంగానూ కన్పించాయి.

"కమల వొట్టి అమాయకురాలు" అనుకుంది రజని.

* * *

రజని కళ్ళు భగ్గున మండుతున్నాయి. టేబిల్‌మీద శుభ లేఖ... తన స్నేహితుడు, హితుడు, శ్రేయోభిలాషి అనుకున్న మూర్తి అందించిన వివాహాహ్వాన పత్రిక. తన పెళ్ళికి స్నేహితురాలిగా రమ్మని ఆహ్వానిస్తున్నాడు. ఎంత దయ. స్నేహాన్ని గుర్తు పెట్టుకుని- స్నేహాన్ని మర్చిపోలేదని హెచ్చరిస్తూ పంపిన శుభలేఖ.

మూర్తి పెళ్ళి వార్త ఆనోటా ఆనోటా పడి నెల క్రితమే రజనికి తెలిసింది. మొదట నమ్మలేదు. అయినా అడిగింది. మూర్తి తలవంచుకుని నసుగుతూ నిజం చెప్పాడు.

"నువ్వు చెప్పేది ఇదేనా?"

ఏం చెయ్యమంటావ్.... పరిస్థితులు తిరగబడ్డాయి...."

"అంటే.... నువ్వు మీవాళ్ళతో మన స్నేహం గురించి చెప్పలేదన్నమాట. నన్ను పెళ్ళి చేసుకుంటానని ధైర్యంగా మాట్లాడలేకపోయానంటావ్!

నువ్వు నా కోసం తెగించి, నీ బంధాలన్నీ తెంపుకుంటావనుకున్నాను. నాకున్న అనర్హతలేమిటి చెప్పు? నీతో చనువుగా ప్రవర్తించడం నా నేరం అంటే నేను ఆత్మహత్య చేసుకోవాలి. ఉద్యోగం చేస్తూన్న అందంవున్న, పరిచయం స్నేహం వున్న నాకంటే మీవాళ్ళు కుదిర్చిన అమ్మాయి, నీకు ఏవిధంగా మంచి భార్య అవుతుంది- చెప్పు?"

మూర్తి నెమ్మదిగా అన్నాడు, "నీకు ఆవేశం" ఎక్కువ అని.

"ఆవేశం కాదు, బాధ. నా తప్పు ఏమిటో తెల్సుకోవాలని ఆరాటం. సరేనా!"

"మావాళ్ళు ఒప్పుకోలేదు రజనీ.... ఉద్యోగంచేసే ఆడపిల్లలంటే మావాళ్ళకు పడదు...."

"నువ్వు ఈ తరంవాడివి. ఆడపిల్ల ఉద్యోగం చేయడం, మగవాళ్ళతో స్నేహంగా తిరగడం' చుట్టూ ఎక్కడా జరగడంలేదా! చదువుకుని జీవితాన్ని చుట్టూ పరిశీలించి చూసే నేర్పువున్న ఆడపిల్ల దుర్మార్గురాలా?"

"నా ఉద్దేశం అది కాదు."

"నాకని ఏమీ మిగుల్చుకోకుండా నీకు సర్వస్వం సమర్పించడం నేను చేసిన తప్పు అనుకుంటాను. నా తెగింపు నీకు నీతిబాహ్యంగా అన్పించిందను కుంటాను. లేకపోతే.... లేకపోతే, నీ చొరవ గురించి నువ్వింట్లో చెప్పి వుండే వాడివి. చూస్తే నా కేరెక్టర్ మీద నీకే అసహ్యం పుట్టిందనుకుంటాను...."
రజని ఏడ్చేసింది.

మూర్తికి జవాబుగా మాటలు దొరక లేదు....


"నాకన్పిస్తోంది మూర్తీ....మీకు పెళ్ళాలుగా అతి నెమ్మదస్తులు, మంచి కుటుంబాలనుంచి వచ్చి తలెత్తకుండా వుండే ఆడపిల్లలే కావాలి.... స్నేహితు రాలు, సాటి ఉద్యోగస్తురాలూ మీకు భార్యలుగా నచ్చరు. ప్రేయసిగా మాత్రం చూడగలరు. అంతేగా...."

రజనికి ఎక్కిళ్ళు వచ్చాయి. ఎర్రటి కార్డు మీద ఆహ్వానం నిప్పులు చెరుగు తోన్నట్టుగా కన్పిస్తోంది. జీవితంలో అతి మధురమైన ఘట్టానికి తను దూరం అవుతున్నానని అయ్యాననీ ఆ రోజే రజనికి తెలిసొచ్చింది....

* * *

"నీతో మాట్లాడాలే అక్కయ్యా" అని తులసి అంటే ఏమిటో అనుకుంది రజని.

'చెప్పు'. అంది కుర్చీలోకూర్చుంటూ.



తులసి ఓసారి రజనిని చూసి గది తలుపు గొళ్ళెం పెట్టి వచ్చింది....

"తలుపెందుకే వేస్తున్నావ్?"

"ఊరికెనే...."

నిశ్శబ్దం.... తులసి తలెత్తి రజనిని చూసి తిరిగి తలదించుకుంది.... రజనికి ఏమీ అర్థంకాలేదు. తులసికి ఏమయి వుంటుంది! ప్రేమలోగాని పడిందా? లేక ప్రణయంలో పడి ముందుకు వెళ్ళి.... రజనికి ఊహించడానికే భయంవేసింది.

"నువ్వు ఏమీ అనుకోకూడదు...."

"అదేమిటి!"

"నువ్వు బాధపడితే నేను ఏమీ చెప్పను. లేచి వెళ్ళిపోతాను."

"ఏం జరిగింది?"

"అక్కా.... మొన్న నాకు పెళ్ళి వారొచ్చారే! నువ్వు ఆఫీసుకు వెళ్ళిన తర్వాత— అన్నయ్య సడెన్‌గా తీసుకు వచ్చాడు...."

"అన్నయ్యా?"

"తప్పు వాడిదీ కాదు.... అతగాడు నన్ను రోజూ కాలేజీలో చూస్తున్నాట్ట... దాంతో అతను తెగించి యింట్లో చెప్పడం, వాళ్ళ అన్నగారు మన అన్నయ్యకి ఫ్రెండ్ అవడంతో ఈ పెళ్ళిచూపులు జరిగాయి...."

"బావుంది."

"పెళ్ళికొడుకు పేరు రమేశ్.... వాళ్ళ నాన్నగారికి ఒంట్లో బాగాలేదట. పెళ్ళి ఈ నెల్లోనే జరగాలని షరతు పెట్టారుట...."

రజని ఏమీ మాట్లాడలేదు.

"ఇప్పుడు చెప్పు? నన్నేం చెయ్యమంటావ్" అంది త్వర త్వరగా తులసి.

"ఏం చెయ్యమంటాను?" సణుక్కుంటూన్నట్టు అంది రజని.

"నీ పెళ్ళి...."

రజని మాట్లాడలేదు.

"అమ్మ ఒకటే ఏడుపు నీ గురించి. నేనూ ఆలోచించాను. నా పెళ్ళి అయితే మరి నీ పెళ్ళి ఎలా అవుతుంది?"

రజనికి దుఃఖం ఆగిందికాదు. తన కన్నా ఏడేళ్ళు చిన్నది తులసి. పెళ్ళి పీటలకి రోజుల దూరంలోవుంది.

"అన్నయ్యతో చెప్పాను.... వాడేం మాట్లాడలేదు. అమ్మ నాన్నగారితో చెపుతోంది...."

"అక్కయ్యా.... అందం, ఉద్యోగం, చదువూ అన్నీ ఉన్నాయి నీకు! నీలాంటిదాన్ని పెళ్ళికూతురుగా గుర్తించలేని వాళ్ళెవరో గుడ్డివాళ్ళయి వుండాలే!"

రజని బావురుమంది.

"వద్దు.... ఏడ్వకు...."

తనకన్నా చిన్నదాని ముందు అంతకు మించి మరే సమాధానం చెప్పలేక రజని ఏడ్చేసింది.

"నీ మనసులో ఎవరైనా వుంటే." తులసి ఆగి అంది.... "నువ్వెవరినయినా ప్రేమించావా అక్కా...."

రజని మాట్లాడలేదు....

"నా పెళ్ళి ముందు నీ పెళ్ళి కావాలే.. నాకెందుకో నిన్ను తోసిరాజని పెళ్ళి చేసుకోవాలనిపించడంలేదు...."

"నువ్వేం చెయ్యగలవు?"

"నాకు తోచిన సహాయం."

"నాకు పెళ్ళి కాదే!"

తులసి గమ్మున అంది. "అది నీ నిరాశ. అంతే"

"నిరాశ కాదే! నిజం. జీవితంలో వెనకబడితే వెనకే అవుతుంది.... ముప్ఫై ఏళ్ళు వచ్చిన ఆడదాన్ని పెళ్ళికూతురుగా అంగీకరించే ధైర్యం చాలా తక్కువ మందికి వుంటుంది. నన్ను చేసుకునేవాడు చాలా దురదృష్టవంతుడై వుండాలి.... లేకపోతే ఆదర్శవాది అయ్యుండాలి.... ఆఖరిగా రెండో పెళ్ళివాడైనా కావాలి"

"అలా అనొద్దు.... నీ పెళ్ళి జరగాలి.... నువ్వు అదృష్టవంతురాలివి కావాలి. ఉద్యోగం చేసుకోవడంలో డబ్బు సంపాదించడంలోనే నీ ఆనందానికి హద్దులు పడకూడదు."

"తులసీ! నాగురించి నువ్వెందుకు బాధపడాలి.... వద్దు, నాకు పెళ్ళికాదు. అంతే! ఇప్పటికే నామీద ఆఫీసులోనూ, వీధిలోనూ సవాలక్ష ప్రచారం వుంది. నా మూలంగా నీ పెళ్ళి కూడా జరగదని అమ్మ ఎన్నోసార్లు అంది నా మొహం మీదే...."

తులసి ఆలోచిస్తూనేవుంది, అక్కగారికి తనేం చెయ్యగలనా అని.... ఏ మార్గమూ లేదని ఓ పక్క తెలుస్తూనే వుంది. తన మనసులో వుద్దేశం రజనికి తెలియకూడదు.... తను పెళ్ళి గురించి తహతహలాడుతోందనీ యింట్లోవాళ్ళు అందరూ తనని ఏకాకిని చేస్తున్నారని ఊహిస్తే రజని భరించలేదు.

కొందరి జీవితాలు దారి తప్పి నడుస్తాయి. వాళ్ళ జీవిత పరమార్థం కన్నీరు నింపుకోవడమే!!

తను అక్కగారి గురించి త్యాగం చెయ్యవల్సివస్తే ఆ త్యాగానికి కూడా ఓ హద్దు వుంటుందని తులసికి బాగా తెలుసు. అక్క బ్రతుకు మోడువారిందని ఏ చెల్లెలయినా తన బ్రతుకుని పణంగా పెడితే పెట్టచ్చు. కానీ తనకి ఎందుకో ఆ దారిని వెళ్ళడానికి, ఆ తరగతి జనాభాలో చేరడానికి యిష్టం కలగడంలేదు. ఎదటి వాళ్ళ కష్టాలు చూసి సానుభూతి అందివ్వడం సహజం.... అంతేగాని స్వార్థం చూసుకోకుండా త్యాగం చేయడం వెర్రితనం.

తులసి చాలాసేపు చీకటి గదిలో అలా కూర్చునేవుంది.... రజని బయటకు వెళ్ళింది.... బాత్‌రూమ్‌లో చప్పుడు విన్పిస్తోంది.... మొహం కడుక్కుంది. తిరిగి గదిలోకి వచ్చి.

"ఇంకా అలానే కూర్చున్నావా.... లే".... అంది మామూలుగా.

* * *

రజని ఆ రాత్రి అంతా ఆలోచిస్తూనే వుంది. మాటి మాటికీ చెల్లెలు తులసి గుర్తొస్తోంది. చెల్లెలు అందుకోబోతున్న అదృష్టం కళ్ళముందు కదుల్తూ కన్పిస్తోంది.

తనకన్నా చిన్నది తన ముందు నుంచుని ఎంత సానుభూతి అందించింది. అదంతా సానుభూతేనా??

రజనికి తులసి మాటల్లో సానుభూతి కన్నా ఎక్కువగా హెచ్చరిక కన్పించింది, ఈసారి. నిజమే! తన బ్రతుకు నానాటికీ తీసికట్టు అయింది.... తనకన్నా చిన్న వాళ్ళందరి భవిష్యత్తుకి తను అడ్డుగోడగా నిలబడింది.... ఇందులో ఎవరి తప్పు ఎంతటిది అనిగానీ- నిజాయితీ ఎవరి వైపు వుందనిగానీ ఎవరూ ఆలోచించరు. తన బ్రతుక్కి అడ్డుగా నిలబడ్డది తండ్రి అవనీ తల్లి అవనీ సహించరు. అలాంటిది వయసు ముదిరిన అక్కని ఖాతరు చేసేదెవరు? తులసి మంచితనం వుంది కాబట్టి అమాత్రం సలహా యిచ్చింది. వీలయినంత త్వరలో తనని

తన మార్గం చూసుకోమని నొచ్చుకో కుండా చెప్పింది....

రజనికి ఎంత ఆలోచించినా ఏ మార్గమూ తోచలేదు. ప్రేమించడం, పెళ్ళి చేసుకోవడం కొందరికి వరంగా మిగిలితే మరికొందరికి శాపం అవుతుంది. తనకోసం యింట్లోవాళ్ళు సంబంధాలు వెదకడం మానేసి చాలా రోజులయ్యింది. తనని ఆడపిల్లల జాబితాలోంచి తనవాళ్ళే తొలగించారు.

రజనికి ఆ సమయంలో కమల ఒక్కతే తన పాలిటి దేవతగా గుర్తొచ్చింది....

తెలియకుండా గుండెల్లో పుట్టే గుబులుని— కళ్ళ వెంట కదిలీ కదల కుండా పుట్టే తడిని తట్టుకోలేక మంచం మీదనుంచి లేచి పమిట కొంగుతో కళ్ళు వత్తుకుని కిటికీ దగ్గరకు వెళ్ళి నిలబడి తనని తానే ఓదార్చుకుంది.... తెల్లవారే వరకూ కిందా మీదా పడింది.... ఎనిమిది గంటలకు స్నానం పూర్తిచేసి బయటపడాలనుకుంది....

తల్లి వెనకే వచ్చి అంది....

"ఇంత పొద్దునే ఎక్కడికే?"

"పనుంది...."

"ఇలా తిరగడం బావుండదే, నా మాట విను...."

రజనికి కళ్ళు నీళ్ళు తిరుగుతున్నాయి.

"నేనెలా తిరిగినా తులసికి వచ్చే సంబంధం ఆగిపోలేదుగా అమ్మా.... ఇప్పుడయినా నన్ను మంచిదాన్ననుకో" అనేసి వీధిలో పడింది....

తలుపు తీసి రజనిని చూసి కమల ఆశ్చర్యపోతే రజని కమలని చూసి సంతోషంగా కౌగలించుకుంది....

"ఏమిటి విశేషం....?"

"ఆఫీసులో చెప్తాను."

ఇద్దరూ ఆఫీసుకు బయలుదేరారు. దారిలో హోటల్లో ఫామిలీరూమ్‌లో కూర్చోబెట్టి రజని నెమ్మదిగా అంతా చెప్పి,

"చూడు ఆఖరికి నేను మూర్తికేకాదు. ఇంట్లోవాళ్ళకి కూడా కాకుండా పోయాను...."

"బాగానే వుంది" అంది పెదవి చప్పరిస్తూ కమల.


"కమలా.... నేను పొరబాటు చేశానంటే ఒప్పుకుంటాను. అంతేగాని బ్లండర్ ఏమీ చెయ్యలేదే! దీనికే నేను యింతగా నష్టపోవాలా...."

"ఊరుకో...."

"నీ ఇష్టం వచ్చినవాణ్ణి చూడు. పెళ్ళిచేసుకుంటాను. నావైపు నుంచి షరతులేం లేవు...."

"రజనీ...."

"అవునే.... తులసికన్నా ముందు నా పెళ్ళి అవాలిట.... నాకు తెలుసే! అందులో దాని స్వార్థం వుంది. ఇంట్లో నాలాంటి అక్క వుందని తెలిస్తే దాని




కొచ్చిన సంబంధం ఎక్కడ తిరిగి పోతుందోనని దాని బాధ"

రజని నవ్వేసింది....

కమల రజనిని చూస్తూ వుంది....

"ఇది చెప్పడానికేనే నిన్ను ఇలా లాక్కొచ్చింది. నా బ్రతుకు ఏ మలుపు తీసుకున్నా నేను లెక్కచేయను. దుఃఖ పడను.... సరేనా...."

"అలానే" మావారితో చెప్తాను...."

"ఏడెనిమిదేళ్ళనాడు నీ మాట వినుంటే ఎంత బావుండేది. పశ్చాత్తాపం ఎప్పుడూ ఆలస్యంగానే కల్గుతుందిట."

"అవన్నీ ఎందుకులే."

"మరి నే వెడతానే."

* * *

రజనికి నెత్తిమీద పిడుగులు పడ్డట్టు

య్యింది. ఏమీ ఆలోచించలేకపోతోంది. గుండెలెవరో పిండుతోన్నట్టుగా వుంది.

జీవితం ఓ కొలిక్కి వస్తోన్నట్టుగా వచ్చి తిరిగి క్రూరమైన మలుపు తిరిగింది.

ఒక్కరోజు ఆగితే జగన్నాథరావుతో తన వివాహం జరిగి వుండేది. కమలా, కమల భర్తా సాక్షులుగా రిజిష్ట్రారాఫీసులో తన పెళ్ళి జరిగి తను గర్వంగా ఇంటికి వెళ్ళి భర్తని తల్లిదండ్రులకు, తులసికి పరిచయం చెయ్యాలనుకుంది.

"అత నింత హఠాత్తుగా మనసు మార్చుకుంటాడనుకోలేదే" అంది కమల జాలిగా.

రజని మాట్లాడలేదు.

"తనకి పెళ్ళి యిష్టంలేదంటే నేను బాధపడేదాన్నికాదు.... నిన్నూ నీ ప్రవర్తననీ కించపరుస్తూ మాట్లాడాడు"

"పోనివ్వు. నాది వెధవ జాతకం.... అనవసరంగా మిమ్మల్ని బాధపెట్టాను."

"నాకేం బాధ లేదే.... ఉన్నదల్లా నీకే సహాయమూ చెయ్యలేకపోయానే అని. అంతే....''

కమల రజనిని ఓదార్చి యింటికి వెళ్ళిపోయింది.

రజని తలుపులు బిగించుకుని గదిలో కూర్చుంది. ఏం చెయ్యాలో తోచడం లేదు. ఓడిపోయినందుకు దుఃఖం కల్గడం లేదు. తన దారులన్నీ మూసుకుపోయాయని రూఢీ అయినా బ్రతుకుమీద విరక్తి కలగడంలేదు. యిరుకయిన ప్రపంచంలో తన బ్రతుకు బంధించబడ్డందుకు జాలివేయడంలేదు. చుట్టూతా వున్న క్రౌర్యం చూసి నవ్వు కల్గుతోంది. వెన్నంటి నీడలా నడుస్తున్న వంచనని చూసి అసహ్యం పుడుతోంది. ఎవరిమీదా పగలేదు. అభిమానంలేదు. ఒక నిశ్శబ్దత చుట్టుముట్టి వివశత కల్గజేస్తోంది, తలుపు కొడుతున్న చప్పుడు.... ఆలస్యంగా లేచి తలుపు తెరిచింది రజని.... చెల్లెలు తులసి.... తులసిని చూడగానే ఇదివరకులా ఏడవాలనిపించలేదు. ఆమె ఆలోచనా ధోరణి జ్ఞాపకం వచ్చి తిట్టాలనిపించలేదు....

"అక్కా.... అలా చూస్తావేమిటే" అంది తులసి.

"ఏం లేదు...."

తులసి తలవంచుకుని అంది—

"నా పెళ్ళి చెడిపోయిందే" అని.


రజని తలెత్తి చూసింది.

"అవును. అందుకు కారణం మాత్రం నువ్వుకాదు. నేను నిన్ను తిట్టాలనీ ద్వేషించాలనీ రాలేదు."

"నువ్వు యిష్టం వచ్చినట్టు అను. నేను తయారుగా వున్నాను. నాలాంటి అక్కకి చెల్లెలివి అవడం నీ దురదృష్టం...."

"కాదే. నీలాంటిదానికి చెల్లెల్ని అయినందుకు నే నీ రోజు గర్వపడుతున్నాను..."తులసి ఆగి మళ్ళీ అంది—

"చెల్లెలు పెళ్ళి కాదని మధనపడి




పెళ్ళికోసం నానా అవస్థలూపడి అక్కడా అవమానం రుచిచూసిన నీలాంటి మనిషికి ఎలాంటి చెల్లెలుగా ప్రవర్తించాలో నాకీరోజు అర్థమయిందే. అందుకే నీ పెళ్ళి జరిగేవరకూ నేను పెళ్ళి చేసుకునేదిలేదని రమేశ్‌తో చెప్పాను.

రజని ఆశ్చర్యంగా చూసింది.

"ఎన్నో ఆశలతో, ఎంతో ధీమాతో బ్రతుకుతున్న నీలాంటి ఆడపిల్లలు వయసు మీరి పెళ్ళికి అనర్హులవడం చాలా అన్యాయం. నువ్వు సుఖపడడం అనేది జరగాలి. అది మన ఆడజాతికీ వాళ్ళ స్థైర్యానికి అగ్నిపరీక్ష.... ఈ పరీక్షలో నేను ధైర్యంగా నిలబడదా మనుకుంటున్నానే."

"తప్పు.... అలా అనొద్దు.... నా గురించి నీ బ్రతుకు పాడుచేసుకోవడం అవివేకం. నా మాట విను...."

"జగన్నాథరావు పెళ్ళికి ఒప్పుకుని ఆఖరిక్షణంలో నిన్ను తిరస్కరించడం మంచిపని అయితే— నా అక్క గురించి నన్ను ప్రేమించిన రమేశ్‌ని కాదనడం నాకు ఆదర్శం కింద లెఖ్ఖకి వస్తుంది.... అంతే...."

రజని ఆశ్చర్యంగా తులసిని చూస్తూ వుండిపోయింది.

———